తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# పంటపొలాల్లో మళ్ళీ ఏనుగుల బీభత్సం

## భయాందోళనలో కొండ్రెడ్డి కండ్రిగ ప్రజలు



చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త: శేషాచల అడవుల నుండి వచ్చిన ఏనుగులు కొండ్రెడ్డి కండ్రిగ చెరువు సమీప వ్యవసాయ పొలాల్లో భీభత్సం సృష్టించాయి. ఏనుగుల దాడిలో శేషాపురం ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి మృతి విషయాన్ని మరువక ముందే మరోమారు ఏనుగులు గ్రామాలకు సమీపంలోని పంటపొలాల్లోకి వస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కొండ్రెడ్డి చెరువు దిగువ భాగాన యల్లంపల్లి సమీపంలోని ముగ్గురు రైతులకు చెందిన మామిడితోటలు, అరటితోటలు, వరి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో అటవీశాఖ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి ఏనుగుల గుంపును దారిమళ్ళించి సికిమానుకోన పైభాగాన గల దట్టమైన అరణ్య ప్రాంతంలోకి తరిమే ప్రయత్నం చేస్తున్నారు. కాగా ఏనుగుల దాడులపై స్పందించిన ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులను అప్రమత్తం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని తనకు తెలియజేయాలని ఆదేశించారు.

### ఉషోదయం ముందా..?

# ఉపగ్రహ ప్రయోగం ముందా..?

- అందరి కళ్లూ తూర్పుతీరంపైనే
- మరికొద్దిసేపట్లో నింగికి ఎగరనున్న 100వ రాకెట్
- జిఎస్ఎల్‌వి-ఎఫ్15 విజయవంతమయితే మరిన్ని నావిగేషన్ సేవలు
- ఇస్రో నూతన చైర్మన్ ఆధ్వర్యంలో ప్రయోగ ఏర్పాట్లు



శ్రీహరికోటలో అంతరిక్షంలోకి గురిపెట్టిన 100వ రాకెట్ జిఎస్ఎల్‌వి-ఎఫ్15

శ్రీహరికోట (తడ), జనవరి 28 ప్రభాతవార్త బుధవారం ఉదయం సూర్యుడు ముందు ఉదయిస్తాడా ? జిఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ముందు నింగికి ఎగరనుందా ? దాదాపు నిమిషాల వ్యవధిలోనే ఈ రెండు సంఘటనలు జరగనున్నాయి. జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 17వ ప్రయోగం బుధవారం ఉదయం 6.23 గంటలకు జరగనుంది. ఈ సమయాన్ని ఇస్రో ఇప్పటికే ఖరారు చేసింది. శ్రీహరికోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. అప్పటికే తూర్పు తీరాన వెలుగులు విరజిమ్మనున్నాయి. అందులోనూ ఈ రాకెట్ 420.7 టన్నుల బరువు గలది. ఇందులో మొదటి దశ అతి పెద్దది. రెండు, మూడు దశలు కూడా ఉన్నాయి. మూడు దశలు విడిపోయేంత వరకు రాకెట్ దాదాపుగా వీక్షకులకు కనువిందు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత అంతరిక్షంలోకి ప్రవేశించిన రాకెట్ 1150 సెకన్ల వ్యవధిలో మన దేశీయ సేవల కోసం రూపొందించిన 2250 కిలోల బరువు ఉన్న ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని జిటిఓ కక్ష్యలో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ సమయం కోసం భారత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శ్రీహరికోట రాకెట్ అంటే ఒకప్పుడు తీపిమిఠాయి ప్యాకెట్‌గా నాలుగు దశాబ్ధాల నుంచి విద్యార్థులు చిన్నారులు పాడుకునేవారు. అయితే అప్పట్లో ఇంతకాలం హుషారుగా రాకెట్ల ప్రయోగం ఇక్కడి నుంచి జరుగుతుందా అన్న అనుమానాలు లేకపోలేదు. ప్రస్తుతం రాకెట్ల సంఖ్య ఏకంగా 100కు చేరింది. అంతరిక్ష పరిశోధనలో అగ్రరాజ్యాలకు ఉన్న రాకెట్ ప్రయోగ కేంద్రాలకు ఏమాత్రం తీసిపోని శ్రీహరికోట ప్రస్తుతం 'వంద'నం.

## అటు వైసిపి రిలాక్స్...

# ఇటు కూటమికి టెన్షన్ !

### -పార్టీ మారితే అనర్హతవేటు తప్పదా!?
### -క్యాంప్ రాజకీయాలకు సన్నద్ధం



ప్రభాతవార్త-తిరుపతి: ఎడతెగని ఉత్కంఠత...భారీ మెజార్టీ ఉన్నా సొంత పార్టీ కార్పొరేటర్లు నిర్వాకంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వైసిపి నాయకత్వం....కార్పొరేషన్‌లో పట్టుకోల్పోకూడదని పంతం..వెరసి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో కూటమిపార్టీల నేతల తీరుతో సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఇప్పుడు అంతా ఫిబ్రవరి 3వతేదీ తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో వైసిపి బలాబలాలు,కూటమిపార్టీ జనసేన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉనికి చాటుకునే సమయం ఆసన్నమైందనే చర్చ మొదలైంది. తొలిసారిగా తిరుపతి మున్సిపాల్టీ నుండి తిరుపతి నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చెంది 2021 ఏప్రిల్‌లో జరిగిన తొలి కౌన్సిల్ ఎన్నికల్లో 50 మంది కార్పొరేటర్లకుగాను అప్పటి అధికారంలో ఉన్న వైసిపి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 22 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లను ఏకగ్రీవం చేసుకున్నారు.మిగిలిన 28 డివిజన్లకు ఎన్నికలు జరగ్గా 9వ డివిజన్‌లో కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదాపడింది.ఇప్పటికీ ఆ డివిజన్ ఎన్నికలు జరగలేదు. కాగా ఏడాదిన్నర క్రిందట 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతనాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు 48మందిలో ఒక టిడిపి కార్పొరేటర్, మరో 10మంది వైసిపి కార్పొరేటర్లు స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీష, ఉప మేయర్‌గా ఉన్న ముద్రనారాయణతోబాటు గతంలో రాజీనామా చేసిన భూమన అభినయ్‌రెడ్డి కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్లే. 2021 ఎన్నికల్లో నయానా భయానో దౌర్జన్యాలకు పాల్పడి ఏదోరకంగా గెలిచిన వైసిపి కార్పొరేటర్లలో కొందరు పార్టీని వీడేందుకు సిద్దంగా ఉన్నారు.అయినా వైసిపికి బలంగా 37మంది కార్పొరేటర్లు ఉన్నారనే విశ్వాసం ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. మరీ 30వతేదీ జరగనున్న కలెక్టర్ సమావేశంలో ఎంతమంది వైసిపి కార్పొరేటర్లు హాజరవుతారు,ఎందరు గైర్హాజరు కానున్నారనేది వీడని చిక్కుముడే.

**-ఒక్క డిప్యూటీ కోసం క్యాంపు రాజకీయాలేనా!:**

ఇప్పటికీ నగరపాలక కౌన్సిల్‌లో కీలకమైన మేయర్ కుర్చీ డాక్టర్ ఆర్.శిరీష(వైసిపి)నే బలంగా ఉన్నారు. ఉప మేయర్ ముద్రనారాయణ కూడా వైసిపిలోనే కొనసాగుతున్నారు. మరీ బలం ఉన్న ఆ పార్టీకి తాజా రెండో డిప్యూటీ మేయర్ ఎన్నిక ఫిబ్రవరి 3న జరగనున్న కీలక ఘట్టంలో వైసిపినే చేజిక్కించుకోగలదనడంలో ఎలాంటి సందేహం లేదు. అదే జరిగితే సిట్టింగ్ ఎమ్మెల్యే జనసేనపార్టీ ఆరణికి బలమైన ఎదురుదెబ్బే. ఇప్పటికీ ఐదారుగురు వైసిపి కార్పొరేటర్లు ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ డివిజన్‌లో అభివృద్ధిని వదిలేసి వారి పనులు చక్కబెట్టుకుంటున్నారనేది ప్రజల్లో విమర్శలు. మరీ పరోక్షంగా జరగనున్న మరో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసిపి నుండి ఎవరికి అవకాశం దక్కుతుంది, ఎవరినీ అదృష్టం వరిస్తుందనడానికి కొందరు కార్పొరేటర్లతో క్యాంపు రాజకీయాలకు బేరసారాలతో సిద్ధమవుతున్నారనేది సమాచారం. అయితే వైసిపి నేతలు మాత్రం తమ పార్టీకి ఎలాంటి ధోకా లేదని, తొలి కౌన్సిల్‌లో మరో ఏడాది వరకు తమ సత్తామళ్ళీ చాటుకుంటామనే ధీమాతో ఉన్నారు. కూటమిపార్టీకి మాత్రం ఎనిమిదినెలల పాలన రెఫరండంగానే భావిస్తున్నారు. అయితే మరో 48గంటల్లోనే రాజకీయపరిణామాలు ఏంటనేది తేలిపోనుంది. చివరగా ఫిబ్రవరి 3వతేదీ మరో డిప్యూటీ మేయర్ పదవిని చేజిక్కించుకునే సత్తా ఉన్న పార్టీ నాయకుడు ఎవడనేది అందరిలోనూ నరాలు తెగే టెన్షన్ నెలకోంది.

# మండలాలకు నెలలో నాలుగు రోజులు తప్పనిసరి



పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లు పరిశీలించాలని వారికి దిశా నిర్ధేశం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## - స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ సుమిత్‌కుమార్ దిశా నిర్ధేశం

చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పలు పథకాల అమలు తీరు, అర్హులైన లబ్దిదారులకు పథకాలు చేరుతున్నాయా! లేదా! అనేది పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మండల స్పెషల్ ఆఫీసర్లకు దిశా నిర్ధేశం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలిసి ప్రభుత్వ పథకాల అమలు తీరు, పర్యవేక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వీటి అమలు తీరుతో పాటు శాఖల పనితీరును పర్యవేక్షించడం ద్వారా లోపాలను సరిదిద్దుకుని సమర్థవంతంగా ప్రజలకు సుపరిపాలన అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం వుందన్నారు. ప్రతి మండల స్పెషల్ ఆఫీసర్ నెలలలో నాలుగు పని దినాలు వారికి కేటాయించిన మండలాలను క్షేత్ర స్థాయిలో వెళ్ళి ప్రభుత్వ పథకాల అమలు తీరు, ఇతర కార్యకలాపాలు చేపట్టి రావాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్ళు, పిహెచ్‌సిలు, గ్రామ సచివాలయాలు తదితరాలను పరిశీలించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరును అంచనా వేయవచ్చునన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ, బడి బయటి పిల్లల వివరాలు సేకరణ, మెను ప్రకారం విద్యార్థులకు భోజనం సరఫరా, పిహెచ్‌సి స్థాయిలో సంబంధిత మెడికల్ ఆఫీసర్ల సమయపాలన పరిశీలన, మందుల నిల్వ సామర్థ్యం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతల నమోదు, పౌష్టికాహారం వారికి అందుతున్నది లేనిది పరిశీలించడం, వారి పనితీరులో లోపాలు వున్నట్లైతే గుర్తించి సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారి లోపాలను సరిదిద్దుకుని పనిచేసేలా సూచనలు చేయడం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి.వెంకటేశ్వరీ, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్‌రెడ్డి, డిఎల్‌డిఎ రవికుమార్, ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలమనేరు, కుప్పం, నగరి అర్డీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను

# నిర్ధేశిత గడువులోపు పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జనవరి 28 ప్రభాతవార్త : స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మిని సమావేశ మందిరం నందు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య స్మార్ట్ సిటీపై ఎన్ఈసీ కంపెనీ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత సమయంలోపు వేగంగా పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన పనులకు నిధులు విడుదల చేసి వెంటనే పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో వివిధ దశలలో ఉన్న ప్రాజెక్టుల పనులలో పురోగతి ఉండాలని తెలిపారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులు కూడా నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎన్ఈసీ ప్రతినిధులు ప్రదీప్, జమాల్, అంబర్, ఫణికుమార్, కెల్ట్రాన్, సతీష్, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, చంద్రారెడ్డి, హేమ, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఈఈ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కొండపై ప్రమాదకరంగా

# కాలం చెల్లిన విశ్రాంతి గృహాలు !

### -ఆరుదశాబ్ధాల క్రిందటివి అనుకూలంగా లేవు
### -భక్తులకు కేటాయించినా అసంతృప్తి





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: నిత్యం లక్షమంది యాత్రికులు వస్తున్న తిరుమల కొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ప్రమాదకరంగా మారాయి. చాలావరకు వీటిల్లో కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. అంతేగాక ఈ గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. మూడు సంవత్సరాల క్రిందట దాదాపు వందకోట్ల రూపాయలుపైగానే వెచ్చించి అనేక అతిధిగృహాలు, విశ్రాంతి గృహాలు,కొన్ని కాటేజీలు ఆధునీకరించారు. ఈ పనులు కూడా గత కరోనా వ్యాప్తి సమయంలో బాగా ఆలస్యమయ్యాయి. ఇప్పటికీ మూడునాలుగు విశ్రాంతి గృహాలు, కాటేజీలు ఆధునీకరించే పనులు సాగుతూనే ఉన్నాయి. ఈ నేపధ్యంలో సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్ధాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్ఒ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్,గోవర్ధన్, కల్యాణి సత్రాలు,సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి.ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం త్వరలోనే దాతల నుండి సహకారం కూడా తీసుకునే యోచనలో ఉన్నారు. అంతేగాక టెండర్లు పిలిచినా వాటిని పూర్తిగా పడగొట్టి ఆ స్థానాల్లో అధునాతనంగా భవనాలు, గదులను అన్ని వసతులతో నిర్మించాల్సి కూడా ఉంది. ఆరేడు విశ్రాంతి గృహాలు ఇప్పుడు భక్తులకు పూర్తిగా వినియోగించుకునే పరిస్థితిలో లేవు. దీంతో ఈ విశ్రాంతి గృహాలన్నీ పూర్తిగా పడగొట్టి అద్భుతంగా నిర్మించేందుకు టిటిడి పాలకమండలి అనుమతితో టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

# వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





తిరుచానూరు, జనవరి 28, ప్రభాతవార్త పద్మావతి అమ్మవారి ఆలయంలో ఫిబ్రవరి 4న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొల్పి ఉదయం 6 నుండి 9 గంటల మధ్య కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పొలం తగాదా.. తోపులాటలో వ్యక్తి మృతి



సదుం, జనవరి 28, ప్రభాతవార్త పొలం తగాదాతో వ్యక్తిపై మరొక వ్యక్తి దౌర్జన్యం చేసి తోయడంతో కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సదుం మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు మండల పరిధిలోని నడిగడ్డ గ్రామ పంచాయితీ మాదిగపల్లికి చెందిన సదుం రమణయ్య (65) ఇదే గ్రామ పంచాయితీ పరిధిలోని నడిగడ్డ గ్రామంకు చెందిన తెలుగుదేశం నాయకుడు ఎస్‌జి పవన్ కుమార్ రెడ్డికి గత 30 సంవత్సరాలుగా భూ వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సుమారుగా మూడు గంటల ప్రాంతంలో దళితుడు సదుం రమణయ్య తన మామిడి తోటలో దున్నకాలు పనులు చేస్తుండగా ఎస్‌జి పవన్ కుమార్ రెడ్డి సదుం రమణయ్యతో ఘర్షణకు దిగి, బలంగా తోయడంతో రమణయ్య కింద పడి అక్కడకక్కడే మరణించినట్లు రమణయ్య భార్య నర్సమ్మ మంగళవారం తెలిపింది. మృతుడికి ముగ్గురు కుమార్తెలు వున్నారు. కుటుంబ పెద్ద అయిన తన భర్త చనిపోవడంతో శోకసంద్రంలో మునిగిపో యారు. సదుం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. తమకు న్యాయం చేయాలంటూ దళితులు పెద్ద ఎత్తున రమణయ్య మృతదేహాన్ని తీసుకుని బయలుదేరగా సదుం ఎస్ఐ షేక్షావలి సోమల ఎస్ఐ తన సిబ్బందితో వచ్చి అడ్డుకుని తాము న్యాయం చేస్తామని చెప్పారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం గ్రామానికి రానున్నారు.

# ద్రవిడ వర్సిటీ ఆర్థిక భవిష్యత్తు 'నాక్ ' గుర్తింపు పైనే !!

### నాలుగు శాఖల్లో విద్యార్థులే లేరు..
### పొరుగు రాష్ట్రాల సాయం అంతంతే !!
### - 'ఎ' గ్రేడ్ గుర్తింపుపై నెలకొన్న ఉత్కంఠ !!



కుప్పం, జనవరి 28 ప్రభాతవార్త విభజిత ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఏకైక విశ్వవిద్యాలయం.. ద్రవిడ భాషల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఏర్పడిన దివంగత ఎన్టీఆర్ మానసపుత్రిక ద్రవిడ విశ్వవిద్యాలయం ఆర్థిక భవిష్యత్తు నేషనల్ అక్రిడిటేషన్ కమిటీ(నాక్) ఇచ్చే గుర్తింపుపైనే ప్రస్తుతం ఆధారపడి ంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే బడ్జెట్ వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల వేతనాలకు సరిపోవడం, మరో పక్క ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల చెల్లింపు కష్టతరంగా మారుతోంది. గతంలో వర్సిటీ ఉన్నతాధికారులు వర్సిటీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉండే దూర విద్య విధానం(డిస్టెన్స్ ఎడ్యుకేషన్)లో చేపట్టిన పిహెచ్‌డిల పంపిణీ, దూర విద్యా కేంద్రాల ఏరా ్పట్లు అప్పట్లో వర్సిటీ చరిత్రలో మాయనిమచ్చగా మిగిలిపోయాయి. తదనంతరం దూర విద్యా విధానం రద్దు చేశారు. దీంతో వర్సిటీకి ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం, మరో పక్క యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ (యుజిసి) ఇచ్చే నిధులే దిక్కుగా మారాయి. ఈ తరుణంలో వర్సిటీకి నాక్ 'ఎ' గ్రేడ్ ఇస్తే తప్ప వర్సిటీ ఆర్థికంగా పుంజుకునే మార్గం లేదనే చెప్పాలి. యుజిసి ఇచ్చే నిధులతో భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా వర్సిటీలో పలు శాఖల్లో విద్యార్థులే లేకపోవడం గమనార్హ ం. అయితేనే ం ఆ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లకు మాత్రం ప్రతినెలా లక్షల్లో వేతనాలు చెల్లిస్తుండడం గమనార్హం. ఇది నిజం సుమా.. ద్రవిడ విశ్వవిద్యాలయంలో తుళు, లింగ్విస్టిక్స్, ఎస్‌డిఎల్‌పి, ఫోక్‌లోర్ శాఖల్లో డిగ్రీ, పి.జి. చదివే విద్యార్థులు దాదాపు లేరని సమాచారం. ఫోక్‌లోర్, లింగ్విస్టిక్ విభాగాల్లో మాత్రం ఓ నలుగురైదురు విద్యార్థులు మాత్రం తమ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఇక తెలుగు శాఖలో సైతం ఓ ఐదుమంది విద్యార్థులు మాత్రమే కొనసాగుతున్నారని సమాచారం.

**నాక్ 'ఎ' గ్రేడ్ కోసం విశ్వప్రయత్నాలు :**

దాదాపు 1090 ఎకరాల విశాల విస్తీర్ణంలో పచ్చదనం నడమ ఏర్పాటైన ద్రవిడ వర్సిటీ 27వసంతాలు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నాక్ బి గ్రేడ్ గుర్తింపు వర్సిటీకి ఉంది. ఎ గ్రేడ్ సాధనకు వర్సిటీ ఉన్నతాధికారులు చేపట్టిన చర్యల ఫలితం త్వరలో తేలనుంది. విశాలమైన భవనాలు, అత్యాధునిక గ్రంథాలయ ం, నిష్ణాతులైన ప్రొఫెసర్లు, అధ్యాపకులు ఉన్నా వర్సిటీలో విద్యార్థుల సంఖ్య మాత్రం ఆశించిన స్థాయిలో విద్యార్థులు లేరనేది సుస్పష్టం. మరి ఇటీవల వర్సిటీలో ప్రొఫెసర్ ప్రేమండో మాథూర్ నేతృత్వంలో పర్యటించిన నాక్ బృందం ద్రవిడ వర్సిటీకి ఎలాంటి నాక్ గ్రేడింగ్ కేటాయిస్తుందోననే ఉత్కంఠత వర్సిటీ వర్గాల్లో ఏర్పడింది.

# అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**–పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్**



**తవణంపల్లె, జనవరి 28 ప్రభాతవార్త:** గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాజన్న ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. మండలంలోని దిగువమాఘంలో రాజన్న ఫౌండేషన్ వారి సౌజన్యంతో సుమారు 25 కోట్లు రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అమరరాజా సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడుతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అమరరాజా విద్యాలయం 8వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అమరరాజా సంస్థల ఏర్పాటు ద్వారా వెన్నో వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే తమ సంస్థల ద్వారా అతి తక్కువ ఫీజుతో ప్రపంచస్థాయి ప్రమాణాలు కల్గిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వైద్యరంగంలో కూడా విశేష సేవలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈసందర్భంగా అమరరాజా సంస్థల ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటి వరకు 218 కోట్లు రూపాయలను సమాజాభివృద్ధి కోసం ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. సమాజం తమకు ఏమి ఇచ్చింది అని దంపతులు అహర్నిశలు పాటుపడుతున్నారని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. అనంతరం గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ ఇప్పటిక పేటమిట్ట నందుగల అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వేలాది మంది గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం జరిగిం దన్నారు. అలాగే దిగువమాగంలో రెండవ బ్రాంచిన ప్రారంభిం చినట్లు తెలిపారు. అసెంటర్ ద్వారా ప్లమింగ్, ఎలక్రిషియన్, ఏసీ మెకానిజం వంటి వాటిలో శిక్షణనివ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ నిర్వహకులు రాళ్ళపల్లి సతీష్, డీన్ రవికుమార్, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ నలినికుమార్, అసోసి యేట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్, డిపూ్యటీ జనరల్ మేనేజర్ ధనంజయనాయుడు, అమరాజా విద్యాలయ ప్రిన్సిపాల్ జయశ్రీ, పీఆర్ బాబ్జి, టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్త, కోడి వ్యర్థాలు, దిబ్బలు

**పట్టించుకోని అధికారులు**



**పూతలపట్టు, జనవరి 28, ప్రభాతవార్త** మండలంలోని రంగంపేట క్రాస్, బిఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద గ్రామాలు నుండి రాకపోకలతో ముక్కులు మూసుకుని పోయే పరిస్థితి సిబ్బంది గ్రామాలలో నివసించే ప్రజలు రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం చూపించగా ఉంటుందని ప్రతి నాయకుడు దగ్గర వినపడే మాటలు కానీ కొన్ని గ్రామాలలో నాయకులు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేకుండా పోతుంది. అసలు పల్లెలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించి అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉన్నా పంచాయితీ అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోక పోవడం గమనార్హం. గ్రామాలలో ఎక్కువ శాతం మంది రైతులు రైతు కూలీలు నివస్తున్నారు. రైతులు ఎండనక వాననక ఆరుగలం కష్టపడి పంటలు పండిస్తే ఆ వచ్చే చాలీచాలని డబ్బులతో వారి కుటుంబాలను పోషించుకోవడం వారి పిల్లలను చదివించుకోవడం ఎంతో ప్రయాసతో కూడిన పని ఇక రైతు కూలీలు అయితే రెక్కాడితే గానీ డొక్కాడని వారు ఇలాంటి పరిస్థితులలో వాతావరణంలో వచ్చే మార్పులు వల్ల కొంత మంది అనారోగ్యం పాలవుతున్నారు. వారి అనారోగ్యాలను కాపాడుకోవడం కోసం ప్రైవేట్ అస్పత్రిలో వేలకు వేలు డబ్బులు ఖర్చుచేసి నష్టపోతుంటారు. ఇది ఒక రకమైన సమస్య అయితే గ్రామంలో పారిశుద్యం లోపం వల్ల అనారోగ్యం బారిన పడి అప్పులు చేసి ఆరోగ్యం కాపాడుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రంగంపేట క్రాస్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రధాన జాతీయ రహదారికి పక్కన చెత్త కోళ్ల పేగులు కోళ్ల చదరం పోయడం వల్ల అటు వైపుగా వెళ్తున్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోసిన చెత్తను కోళ్ల వ్యర్థాలు ఎప్పటికి శుభ్రం చేయిస్తారో అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు ఎమ్మెల్యేలు

**కాణిపాకం, జనవరి 28 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని మంగళవారం పలువురు ఎమ్మెల్యేలు దర్శించు కున్నారు. ఈమేరకు పశ్చిమ గోదావరి జిలా నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ నాయగర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజులు కాణిపాకం స్వామివారిని దర్శించుక న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి



**కల్లూరు, జనవరి 28, ప్రభాతవార్త** ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జడ్పి సిఈవో రవికుమార్ నాయుడు అన్నారు. పులిచెర్ల ఎంపిడివో కార్యాలయంలో ఈ నెల 25వ తేది శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపిడిఓ కీలక అధికారులు పంచాయితీ కార్యదర్శులు గైర్హాజరు కావడంతో ఎంపిపి సురేంద్ర నాథ్ రెడ్డి ఈ విషయాన్ని జడ్పి సిఈవో రవికుమార్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయాన్ని మంగళవారం జడ్పి సిఈవో సందర్శించారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పార్టీల ముఖ్యం కాదని వ్యవస్థలు ముఖ్యమని ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవించి ప్రభుత్వ పథకాలను అమలు చేసే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. మండలంలో మండల నిధులు ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు తప్పనిసరిగా పాలన అనుమతులు ఉండాలని ఇస్తారాజ్యంగా పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల సమావేశానికి అధికారులు, కార్యదర్శులు రాకపోవడం సరికాదని తిరిగి ఇలాంటి సంఘటన ఎదురైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎంపిడివో రాజశేఖర్ బాబు, ఏవో మునిరాజాకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపిపి సురేందర్ నాథరెడ్డి, సర్పంచ్ గిరిధర్ రెడ్డి

## వైకాపా పాలనలోఆర్థిక వ్యవస్థ విధ్వంసం

**– రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిది వెంకిటీల సురేంద్రకుమార్**

**చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో గత ఐదేళ్ళ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసంకు గురైందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిది వెంకిటీల సురేంద్రకుమార్ ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర అధికార తెలుగుదేశం ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్ట స్థాయికి చేరుకున్న పరిస్థితుల్లో సిఎంగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చిందన్నారు. దేశంలోని రాష్ట్రాల అభివృద్ధిలో మన రాష్ట్రం కింది నుండి 2వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, దేశం నాయకులు శశికర్‌బాబు, గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్‌షెల్టర్‌కు మోక్షం కల్పించిన ఎంపిపి

**పాలసముద్రం, జనవరి 28 ప్రభాతవార్త:**

పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట నిరుపయోగంగా శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్‌కు ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు మోక్షం కల్పించారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట వున్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరిందని, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం అయ్యాయి. అయితే ఈ కథనాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదు. ఈ క్రమంలో పాలసముద్రం ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు మండల పరిషత్ నిధులతో శిథిలావస్థకు చేరిన పాలసముద్రం బస్‌షెల్టర్‌ను పునరుద్దరించడానికి నడుంబిగించారు. స్థానిక సర్పంచ్, ఎంపిడిఓ మహేష్‌రెడ్డి, ఎంపిపి శ్యామలా శివప్రకాష్‌రాజును అభినందించారు. బస్‌షెల్టర్ పనులు నాణ్యతగా నిర్మించడానికి పంచాయతీరాజ్ ఎఇ జయరాజ్, ఎంపిటిసీ గోవిందరాజులు పనులను పర్యవేక్షిస్తున్నారు. పాలసముద్రం నుండి బస్సులో బయలుదేరి వెళ్ళాలంటే ప్రయాణీకులు బస్సు వచ్చే వరకు బస్టాప్‌లో వేచి చూడాల్సిందే. ఈ క్రమంలో వున్న ఒక్క బస్టాప్ శిథిలావస్థకు గురికావడంతో దీని మరమ్మత్తుల గురించి ఎవ్వరు పట్టించుకోకపోవడంతో ఈ బస్‌స్టాప్ సమీపంలోనే రెండు కొత్త తాత్కాలిక బస్‌స్టాప్‌లు ఏర్పాటు అయ్యాయి. ఈ క్రమంలో మొదట ఏర్పాటు చేసిన బస్టాప్ శిథిలావస్థకు చేరింది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఎంపిపి స్పందించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆలయ ఈఓచే ఉచిత ప్రసాదాల తనిఖీ

**కాణిపాకం, జనవరి 28 ప్రభాతవార్త:**



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఉచిత ప్రసాదాలను పంపిణీ కార్యక్రమంను ఆలయ ఈఓ పెంచలకిషోర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తరపున ప్రతిరోజూ ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేస్తుంటారు. ఈమేరకు పులిహోర, దద్దోజనం వంటి ప్రసాదాలను ఉచితంగా భక్తులకు పంపిణి చేస్తుంటారు. ఈఉచిత ప్రసాద పంపిణీ కార్యక్రమంను ఆలయ ఈఓ పెంచల కిషోర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రసాదాలను నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్ర ఎన్నిక

**కాణిపాకం, జనవరి 28 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యుజెఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆర్ చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రమైన చిత్తూరు ఏపీడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎన్నికల అధికారులు సాటి.గంగాధరం, చల్లా జయచంద్రల ఆధ్వర్యంలో జిల్లా కమిటి ఎన్నికలను నిర్వహించారు. కమిటి ఉపాధ్యక్షుడిగా విలేకరి ఆర్.చంద్ర (వార్త) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో సంఘం రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, ఎన్నికల పరిశీలకులు చంద్రమోహన్‌రాజులతో పాటు జిల్లాలోని పలువురు విలేకరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## క్షయ, కుష్ఠ పట్ల అప్రమత్తంగా వుండాలి : వెంకటప్రసాద్

**చౌడేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త**



క్షయ, కుష్ఠ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా కుష్ఠ, క్షయ నివారణాధికారి(అడిషినల్ డిఎంహెచ్ఓ) వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మండల వ్యాప్తంగా గల క్షయ, కుష్ఠవ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. వ్యాధుల లక్షణాలను ముందుగానే గుర్తించడం వల్ల ప్రభుత్వమందించే మందులు ఉపయోగిస్తే నయమవుతాయన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం పౌష్టికాహార నిమిత్తం ప్రతినెలా రూ. 500లు పంపిణీ చేస్తోందన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించే అన్ని కార్యక్రమాలు వందశాతం పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు పూజ, పవన్‌కుమార్, నవీన్, డిపిఎంఓ దేవదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## బత్తలాపురం పశువైద్యశిబిరానికి విశేష స్పందన

**చౌడేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త**



మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన 270పశువులకు భూటాక్స్ స్ప్రే చేసారు. అదే విధంగా 250 గొర్రెలు, మేకలకు 70దూడలకు నట్టల నిర్మూలనా మందును తాపించారు. గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది రామకృష్ణ, మౌనిక, అనూషా, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

**కుప్పం/శాంతిపురం, జనవరి 28 ప్రభాతవార్త**



కుప్పం, శాంతిపురం మండలాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో మంగళవారం అధికారుల స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. నగరి ఎడిఎ సౌభాగ్యలక్ష్మి, టిఎ యామినిలు ఈసందర్భంగా ఎరువుల దుకాణాలు పరిశీలించారు. అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుని రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో అందుబాటులో ఉన్న అన్ని రకాల ఎరువులు, రసాయనిక మందుల వివరాలను విధిగా నమోదు చేయడంతో పాటు ధరల పట్టికను ఏర్పాటుచేయాలని ఎడిఎ ఆదేశించారు. నిబంధనలు పాటించకుంటే స్టాక్ సీజ్ చేసి దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో కుప్పం, శాంతిపురం వ్యవసాయాధికారులు ఫయాజ్ బాషా, అప్పోజి పాల్గొన్నారు.

## కెంచనబళ్లలో ఎడ్లపందేలు.. ఇద్దరికి తీవ్రగాయాలు

**రామకుప్పం, జనవరి 28 ప్రభాతవార్త**



సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలు పశుసంపదను పూజించి వాటినిచక్కగా ముస్తాబు చేసి గ్రామాల్లో ప్రదర్శించడం ఆనవాయితీ. అయితే ఈ ప్రదర్శనలనే కొంతమంది ఎడ్ల పందేల రూపంలో ఎడ్లకు బహుమతులు ప్రకటించి నిర్వహిస్తున్నారు. మంగళవారం రామకుప్పం మండలం కెంచనబళ్ల గ్రామంలో ఎడ్లపందేలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## నేడు శ్రీ నల్లగంగమాంబ ఆలయ మహాకుంబాభిషేకం

**కుప్పం, జనవరి 28 ప్రభాతవార్త**



కుప్పం పట్టణం పాతపేట మునస్వామిపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ నల్లగంగమాంబఅమ్మవారి ఆలయ మహాకుంబాభిషేకం బుధవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ప్రాత:కాలార్చన, నాడీ సంధానం, హోమాలు, మహాప్రాణ ప్రతిష్టతో పాటు మహాకుంబాభిషేకం, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడం జరుగుతాయన్నారు. అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## పక్కాగా రోడ్డు విస్తరణ పనులు

**– మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం**

**చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త:**



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న హైరోడ్డు విస్తరణ పనులను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మంగళవారం హైరోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ దేవాదాయశాఖ భూములకు చెందిన స్థలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు కమీషనర్ పలు సూచనలు చేశారు. 14 నిర్మాణాలను తొలగించి రోడ్డు వెడల్పు చేస్తుండటంతో విస్తరణ కోసం చేపట్టిన మార్కింగ్ మేరకు పక్కాగా పనులు చేపట్టి రోడ్డును విశాలం చేయాలని కమీషనర్ స్పష్టం చేశారు. ఈ ఎసిపి నాగేంద్ర, దేవాదాయ శాఖ అధికారులు, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.



## జనార్యణంలోకి గాయాలతో వచ్చిన జింక

**– ప్రథమచికిత్స చేసిన గ్రామస్థులు.**

**పెద్దపంజాణి, జనవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని బొమ్మలకుంట గ్రామంలో మంగళవారం ఓ జింక గాయాలతో వచ్చేసింది. సమీపంలోని అటవీ ప్రాంతంనుంచి ఈ జింక ఆహారంకోసం పొలాలబాటపట్టినట్లు తెలుస్తోంది. కాగా కాలికి గాయంతో జింక గ్రామంలోకి రావడంతో ఇదిగమనించిన గ్రామస్థులు వెంటనే జింకను పట్టుకుని దానికి ప్రథమచికిత్స చేశారు. విషయాన్ని అటవీఅధికారులకు సమాచారాన్ని అందించగా వారు జింకను తీసుకుని సమీపఅటవీప్రాంతంలో వదిపెట్టారు.

# నాణ్యతతో చిత్తూరు-గుడియాత్తం రోడ్డు పనులు పూర్తి

**– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి పనులను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్**



**చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త:** చిత్తూరు–గుడియాత్తం రహదారిలో యాదమరి మండల పరిధిలో కాశిరాళ్ళ పరిసర ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి త్వరితంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చిత్తూరు–గుడియాత్తం రోడ్డు పనులను నాణ్యతతో మార్చి 15వ తేదీలోపు చేపట్టి పూర్తి చేసి వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఇక్కడ 3.88 కిమీ రోడ్డును 6.39 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నట్లు ఇందులో సిమెంటు రోడ్డు సైతుం వుందన్నారు. రోడ్డు పనులు త్వరితంగా పూర్తి చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తీరుతాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలో భాగంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అధ్వాన్నంగా వున్న చిత్తూరు–గుడియాత్తం రహదారిని పునర్ నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

**బిటి రోడ్డు పనురుద్ధరణకు చర్యలు**

భూమిరెడ్డిపల్లి గ్రామం వద్ద బిటి రోడ్డు పునరుద్దరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదించారు. భూమిరెడ్డిపల్లి గ్రామస్తులు తమ గ్రామం వద్ద బిటి రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయ్యిందని దీనిని పునరుద్దరించడానికి చర్యలు తీసుకోవాలని చిత్తూరు–గుడియాత్తం రోడ్డు పనులను పరిశీలించడానికి ఇచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందిస్తూ రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా వుండేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, ఎంపిడిఓ వేణు, తహసిల్దారు పార్థసారధి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొర్రార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌రబ్బీ, జిల్లా పార్టీ కార్యదర్శి హేమగిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా కొన్నలి గ్రామంలో రీసర్వే



**తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొట్టంబేడు మండలంలో రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపికైన కొన్నలి గ్రామంలో రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమానికి శరవేగంగా చేపడుతున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం డిఐ రాఘవయ్య, డిప్యుటీ తహశీల్దార్ జగన్‌మోహన్, మండల సర్వేయర్ హరనాథ్‌ల ఆధ్వర్యంలో సచివాలయ సర్వేయర్ లోకేష్‌తో పాటు సచివాలయ సిబ్బంది రీసర్వేను శరవేగంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా రైతుల సమక్షంలో రీ సర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో కొన్నలి రెవెన్యూ పరిధిలో ఉన్న మొత్తం 529.03 ఎకరాలు అందులో పట్టాభూమి 296.88 ఎకరాలు, ప్రభుత్వ భూమి 232.12 ఉందని అందులో 58.59 డికెటీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. రీసర్వే చేయాలంటే ముందుగారైతులకు నోటీసు ఇచ్చి మరుసటి రోజు నుంచి రైతుల సమక్షంలో రీసర్వే చేయబడుతుందని డిఐ రాఘవయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, వెలుగు కమ్యూనిటీ సర్వేయర్ సత్యనారాయణ, విఆర్ఓలు ప్రసాద్, సచివాలయసర్వేయరు విజయలోకేష్, రాఘవ, పవన్, సుకన్య, ఆరీఫ్, హుస్సేన్‌లతోపాటురైతులుపాల్గొన్నారు.

## చియ్యవరంలో తగ్గుముఖం పడుతున్న జ్వరాలు

**.తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త** మండలంలోని చియ్యవరం గ్రామంలో ప్రతి ఇంటిలో ఒకరిద్దరికి సీజనల్ జ్వరాలు రావడంతో పత్రికల్లో వార్తలు రావడంతో డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, పలువురు వైద్యాధికారులు పర్యటించి ఇక్కడ వైద్యశిబిరం నిర్వహించాలని తెలిసిందే. దీంతో ఇక్కడ నెలరోజులు పాటు వైద్యశిబిరం నిర్వహించమని ఉన్నతాధికారులు సూచించడంతో ప్రతిరోజు వైద్యశిబిరం కొనసాగుతోంది. మంగళవారం కూడా గ్రామంలో డాక్టర్ మధవుడు ఆదేశాల మేరకు వైద్యశిబిరాన్ని నిర్వహించడంతోపాటు ఇంటింటికి ఫీవర్‌సర్వేను నిర్వహించారు. గ్రామంలో నివాసం ఉంటున్న వరదయ్య(37)కు జర్వం ఉండడంతో పాటు ప్లేట్‌లెట్స్ 76వేలకు పడిపోవడంతో ఇతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. వైద్యశిబిరంలో హెల్త్‌సూపర్‌వైజర్ అమ్మణ్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి జలజ, ఎఎన్ఎం రోజ, ఆశావర్కర్లుతో పాటు హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, రాణిలు పాల్గొన్నారు. జ్వరం ఉన్న వారికి మాత్రలు పంపిణీచేశారు. నేటి నుంచి కొండ్రాజుపల్లి, పిల్లమేడు గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించడానికి సిద్ధమైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## తహశీల్దార్, ఎంపిడిఓలకు సత్కారం



**తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు కనపరచిన తొట్టంబేడు మండల తహశీల్దార్ మధుసూధనరావు మరియు మండల అభివృద్ధి అధికారి పి.సురేంద్రనాధ్‌లు గణతంత్ర్య దినత్సోవం రోజు తిరుపతి జిల్లా కలెక్టర్ చేతులమీ దుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న సందర్భంగా మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు ఆధ్వర్యంలో ఇద్దరినీ దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఇంకా మరెన్నో ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు గ్రామ ఇన్‌ఛార్జి భాస్కర్‌ముదిరాజ్, మణి, సుబ్రమణ్యం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్లో గీత కార్మికులకు మద్యం షాపు కేటాయింపు

**తిరుపతిరూరల్, జనవరి28 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లుగీత కార్మికులకు ఒక మద్యం షాపు నిర్వాహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎక్సైజ్ సి.ఐ.నరసానాయుడు తెలిపారు. ధరఖాస్తుకు ముగింపు గడువు ఫిబ్రవరి 5వ తేదీన సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలకు లాటరీ పద్దతిన మద్యం షాపు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ధరఖాస్తుదారుడు తప్పనిసరిగి తిరుపతి జిల్లా వాసి అయి ఉండాలి, అందుకు అవసరమై ధృవీకరణ పత్రం, సంబంధిత అధికారులచే మంజూరు చేయబడి ఉండాలన్నారు. ఒకవేళ ధరఖాస్తుదారుని యొక్క క్యాస్ట్ సర్టిఫికేట్ నందు గీత కులాల ఉపకులమును ఒక సమూహపు ఉపకులాల మధ్యలో పొందుపరిచిన యెడల, సదరు ధరఖాస్తుదారుని యొక్క వాస్తవ (నిజమైన) ఉప కులమును ధృవపత్రాన్ని సమర్పించాలన్నారు. ధరఖాస్తుదారుడు ప్రతి ధరఖాస్తుకు తిరిగి చెల్లించబడని, ధరఖాస్తు రుసుమును ప్రభుత్వ ఖాతాకు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ముత్యాలరెడ్డిపల్లికూడలి సమీపంలో వున్న తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో విద్యార్థికి న్యాయం





**తిరుపతిరూరల్, జనవరి28 ప్రభాతవార్త:** జెఈఈ మెయిన్స్ పరీక్ష ఎన్.టి.ఏ (నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ) చేసిన తప్పిదాల కారణంగా ఒక విద్యార్థి ఎంట్రన్స్ ఎగ్జామ్ రాయలేకపోతున్నాను అంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనంపై మంత్రి లోకేష్‌బాబు స్పందించి, విద్యార్థికి న్యాయం చేసాడు. ముత్యాలరెడ్డి పల్లిలో వున్న ప్రవేట్ కాలేజ్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఆకుల కృష్ణారెడ్డి కుమారుడు వైష్ణవ్‌రెడ్డి అనే విద్యార్థి జెఈఈ మెయిన్స్ పరీక్షకు అన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడు. అన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసినప్పటికీ అడ్మిట్ కార్డులో పూర్తి పేరు వేరొకరిది నమోదు కావడంతో విద్యార్థి మధనపడిన విద్యార్థి ఎన్.టి.ఏకు మెయిల్, ఫోన్ ద్వారాను సమాచారం ఇచ్చినప్పటికీ ఎన్ టి ఏ స్పందించలేదని విద్యార్థి ఆవేదన వ్యక్తం చేసారు. కాలేజ్ ప్రిన్సిపాల్ ఫిర్యాదును కూడా పట్టించుకోలేదని వాపోయారు. మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంలో చెర్లోపల్లి బై పాస్ రోడ్డులో వుండే ఐయాన్ డిజిటల్ సిబ్బందిని రిక్వేస్ట్ కొరగా ప్రయోజనం లేకపోయింది. దీంతో విద్యార్థి తండ్రి, ప్రిన్సిపాల్ మీడియాను ఆశ్రయించినట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన కథనానికి మంత్రి లోకేష్ స్పందించి, ఎన్ టి ఏ అధికారులతో మాట్లాడి విద్యార్థి జెఈఈ మెయిన్ పరీక్ష వ్రాయించాడు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతోనే తమ బిడ్డకు న్యాయం జరిగిందని కృష్ణారెడ్డి ఆనందం వ్యక్తం చేసారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నే తెచ్చిన వ్యక్తి ఆరుముగం ఆనందం

***నారాయణవనం, జనవరి 28 ప్రభాతవార్త :*** ఉపాధ్యాయ వృత్తికే వన్నే తెచ్చిన వ్యక్తి ఆనందం ఆరుముగం అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీటీసీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, పుత్తూరు డిప్యూటీ డిఇఓ ప్రభాకర్‌రాజులు పేర్కొన్నారు. ఈనెల 31న పదవీ విరమణను పురస్కరించుకొని మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సుమారు 41 ఏళ్లపాటు ఉపాధ్యాయ వృత్తిలో పని చేసి ఎంతో మందిని ఉన్నత స్థితికి చేర్చారన్నారు. అలాగే సేవాభావం కలిగిన ఆనందం సేవలో ఎంతో అవసరమన్నారు. ఆయన అడుగు జాడల్లో అందరు నడిచి విద్యార్థులకు మంచి విద్యను అనంతరం సత్కరించి మెమెంటోను అందించారు. ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి శివశంకర్, ఎంపి డిఓ గుణశేఖర్, ఎంఇఓజనార్ధన్‌రాజు, బాబయ్య, రిటైర్డ్‌ఎంఇఓలు జయరావ్, నిర్మలమ్మ, టిడిపి నాయకులు టిటిడి ఎన్ భాస్కరన్, సుశీలాషణ్ముగం, టి షణ్ముగం, టీచర్లు కుప్పయ్య, టీచర్లు

## శివయ్య సేవలో బెంగుళూరు మఠ్ స్వామి

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



చాతుర్మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని పీఠాధిపతులు, మఠాధిపతులు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో మంగళవారం బెంగుళూరు మల్లేశ్వరంలోని ద్వారకా బదరికాశ్రమం మఠ్ పీఠాధిపతి విద్యానారాయణ తీర్థ స్వామి తన పరివారంలో వాయులింగేశ్వరుని సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో పూర్ణ కుంభంతో ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌రెడ్డి పర్యవేక్షణలో స్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయంలో దర్శనం చేసుకున్న పీఠాధిపతికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద ఆలయం తరఫున పండ్లు అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే చాతుర్మాస వ్రతం సందర్భంగా నేడు తాము వివిధ దేవాలయాలను దర్శించుకుంటున్నట్లు వివరించారు. తమ మఠం తరఫున 50వ చాతుర్మాస వ్రతం సందర్భంగా తాము వివిధ దేవాలయాలను సందర్శిస్తున్నట్లు వివరించారు.

## ట్రాఫిక్ పాయింట్లలో డివైయస్‌పి,సిఐలు

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



తిరుపతిజిల్లా ఎస్‌పిగా హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు చేపట్టిన తరువాత శాంతి భద్రతలతో పాటు పుణ్య క్షేత్రాల్లో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించారు. మంగళవారం సాయంత్రం పెండ్లిమండపం కూడలి వద్ద డివైయస్‌పి నరసింహారావు, వన్‌టౌన్ సిఐ డి.గోపిలు ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రజలను చైతన్యవంతుల్ని చేసారు. ఇక్కడ ట్రాఫిక్ కష్టాలను డివైయస్‌పి ప్రత్యక్షంగా గమనించారు. అంతేకాక ఇక్కడ ప్రజల్ని, దుకాణ దారుల్ని ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులతో సహాకరించాలని కోరారు. ఎలాంటి రికార్డుల్లేకుండా మైనర్లు ద్విచక్రవాహనాలను నడుపుతున్న చిన్నారులను అపి వారి తల్లిదండ్రులను రప్పించి ఇలా బాధ్యతా రహితంగా వ్యవహారిస్తే ఎలా ? ఏదైనా ప్రమాదం జరిగితే ఏం చేస్తారు? అంటూ చైతన్య పరచారు. అలాగే పెండ్లి మండపం సర్కిల్‌లో ని చుట్టుపక్కల దుకాణ దారులకు సూచనలిస్తూ పట్టణంలోనే ఇది కీలకమైన కూడలి. మీరందరూ ముందుజాగ్రత్తగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవా లన్నారు. ప్రతి దుకాణం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగతనాలతో పాటు ఎవరు ? వస్తున్నారు? ఎవరు ఏం చేస్తున్నారనే అంశం సమాచారం తెలుస్తుందని డివైయస్‌పి నరసింహారావు సూచించారు.

## పంచాయతీ కార్యదర్శి అధ్యక్షుని ఎన్నిక

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రఫీఖాన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షులుగా నారాయణపురం, విశాలాక్ష్మ నగర్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి కందాటి చెంచయ్యను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునికి కొండారెడ్డి రాజేష్, ప్రధానకార్యదర్శిగా బియస్ కవిత, సహాయకార్యదర్శిగా ఎం.లీలావతి, కోశాధికారిగా లీలా కుమార్‌లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. 46 పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవటం వారిలోని ఐకమత్యాన్నికి నిదర్శనం అని ఎంపిడిఒ రఫీఖాన్ అభినందించారు.

## అజయ్ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం

వడమాలపేట, జనవరి 28 ప్రభాతవార్త:



వడమాలపేట మండలం ఎనమలపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు అజయ్ సాయి కుటుంబానికి జనసేన పార్టీ 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసింది. జనసేన పార్టీలో సభ్యత్వం ఉన్న అజయ్‌సాయి గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అజయ్‌సాయి దురదృష్టవశాత్తు మరణించడం చాలా బాధాకరం, జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వల్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెళ్ళ మనోహర్ అజయ్‌సాయి తండ్రి హరినాథ్‌కు 5 లక్షల రూపాయల చెక్కును జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయంలో అజయ్‌సాయి కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలుస్తుందని నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. ఆర్థిక సహాయాన్ని అందుకున్న హరినాథ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మా కుటుంబానికి అండగా నిలిచిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డా. పసుపులేటి హరిప్రసాద్, నగరి నియోజకవర్గం ఇన్‌చార్జి మెరుపుల మహేష్, అలాగే వడమాలపేట మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఉద్యోగి భవిష్యత్‌కు యూపీఎస్ ఉరి

తిరుపతి హెల్త్, జనవరి 28 ప్రభాతవార్త ః



ఉద్యోగుల భవిష్యత్‌కు యూపీఎస్ విధానం ఉరి అని ఏపీ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. మురళీమోహన్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానానికి బదులు యూపీఎస్ అనే కొత్త విధానానికి గెజిట్ విడుదల చేయడం బాధాకరమన్నారు. పాత పెన్షన్ విధానం ద్వారా ఉద్యోగి దాసుకున్న వందశాతం సొమ్ము మొత్తాన్ని రిటైర్డ్ అయిన తర్వాత ఇవ్వడం జరుగుతందని, అయితే యూపీఎస్ కొత్త విధానాన్ని తీసుకుని రావడం వలన ఉద్యోగి దాసుకున్న మొత్తాన్ని రిటైర్డ్ అయిన తర్వాత ప్రభుత్వమే తీసుకోవడం దారుణమన్నారు. వెంటనే యూపీఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

## రాత్రిల్లో బిల్లు లేకుండా తరలిపోతున్న గ్రావెల్

- స్థానికులపై దుర్భాషలాడుతున్న సిబ్బంది

విజయపురం, జనవరి 28 ప్రభాతవార్త:



మండలంలోని మహారాజపురంలో ఈకేకే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహిస్తున్న గ్రావెల్ క్వారీ రాత్రి వేళలో నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తారు. రాత్రి సమయాల్లో గ్రావెల్ తరలింపుపై స్థానికులు ప్రశ్నిస్తే వారిపై సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, దుర్భాషలాడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. వందల కొద్ది క్యూబిక్ మీటర్లు రాత్రి సమయాల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధిక లోడుతో వాహనాలు నడపడం వలన రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతు సమయంలో బిల్లులు లేకుండా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మన ప్రాంతాల నుంచి ఇసుక, మట్టి, కంకర తరలించడానికి నిబంధనలు మాట్లాడే అధికారులకు వందల, వేల క్యూబిక్ మీటర్లు మట్టి యథేచ్ఛగా తరలిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రోడ్డుపై మట్టి చరియలు, గుళ్ళ రాలుతూ పోతూ ఉన్న ఎలాంటి సేఫ్టీ చర్యలు పాటించడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అధునాతన టెక్నాలజీ పై పట్టుసాధించాలి

తిరుపతి విద్య, జనవరి 28 ప్రభాతవార్త



విద్యార్థినులు ఆధునిక ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతున్న అధునాతన టెక్నాలజీపై పరస్పరం సహకరించుకుని పట్టుసాధించాలని చెన్నై సవిత యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎమ్ఎస్ శర్వణన్ పిలుపునిచ్చారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సెలెస్ట్రా2025 పేరుతో రెండురోజుల పాటు జరిగే టెక్స్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు నూతన టెక్నాలజీ, పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. టెక్నోఫెస్ట్లో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ మేధోశక్తిని, ఐడియాలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ రజినీ మాట్లాడుతూ విద్యార్థినులలోని సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించడమే సెలెస్ట్రా టెక్ ఫెస్ట్ ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ క్యాన్వాస్, స్నేక్ లేడర్, టెక్టాక్స్, బగ్ బ్లాస్ట్, బెలూన్ బ్లాస్ట్ పోటీలను నిర్వహించారు. ప్రొఫెసర్ మల్లికార్జున, సీఎస్ఈ హెడ్ ప్రొఫెసర్ సరిత, కన్వీనర్ డాక్టర్ సాయి లోహిత, లక్ష్మీదేవి, పలు కళాశాల నుంచి సుమారు 300మంది విద్యార్థినులు హాజరయ్యారు.

## ఓటేరు నూతన సచివాలయానికి నిప్పు

తిరుపతిరూరల్, జనవరి28 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ఓటేరు గ్రామ సచివాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఇంకా ప్రారంభం కాని సచివాలయ భవనం తలుపులు కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియచేయగా, అప్పటికే ముందువున్న తలుపు కాలిపోయినట్లు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తిరుపతిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. నిప్పు అంటుకున్న ఓటేరు సచివాలయానికి మంగళవారం డిఎల్‌ఎల్‌పిఒ సురేష్‌నాయుడు పరిశీలించారు. నిప్పు ఎవరు పెట్టారు, నిప్పు పెట్టడానికి కారణాలపై ఆరా తీసారు.

## మళ్ళీ తప్పులుచేయొద్దు

-మంచివ్యక్తులుగా మారండి -రౌడీషీటర్లకు డిఎస్పీ శ్రీలత కౌన్సెలింగ్

తిరుపతికార్పొరేషన్, జనవరి 28ప్రభాతవార్త:



పలురకాల కారణాలతో తెలిసీతెలియకో తప్పులు, నేరాలు చేస్తారని మళ్ళీమళ్ళీ ఆ తప్పులు చేయకుండా ఉండటమే మానవత్వమని తిరుపతి ఇన్‌ఛార్జి డిఎస్పీ శ్రీలత అన్నారు. ఇప్పటికే తెలిసీచేసినా తెలియక చేసినా నేరస్తులుగా, అనుమానితులుగా రౌడీషీటర్లుగా నమోదై ఇబ్బంది పడుతుంటారన్నారు. ఇలాంటి వాళ్ళు స్థానికంగా, ఉన్నప్రాంతంలో మంచివ్యక్తులుగా మెలగాలని ఆమె హితవు చేశారు. ఎవరూ కూడా చట్టాన్ని అతిక్రమించరాదని, పోలీసులకు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని ఆమె సూచించారు. తిరుపతి నగరంలోని రౌడీషీటర్లకు ,అనుమానితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కౌన్సెలింగ్‌లో ఈస్టు సిఐ రామకృష్ణ, వెస్టు సిఐ మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## సామంచికి పాలకం శుభాకాంక్షలు

తిరుపతి(రవాణ), జనవరి 28ప్రభాతవార్త:



నాయకత్వలక్షణాలు కలిగిన యువనేత సామంచి శ్రీనివాస్ తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడుగా నియమితులవడంతో టిడిపి నేత పాలకం వెంకటేశ్ అభినందనలు తెలిపారు. మంగళవారం తిరుపతిలో ఆయనను కలసి మర్యాదపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో

పారిశ్రామికంగా నూతన వెలుగులు -తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ

తిరుపతి, జనవరి 28ప్రభాతవార్త:



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఎనిమిదినెలలకే పారిశ్రామికంగా అభివృద్ధిచెందేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ విజన్‌తో పనిచేస్తున్నారని అన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం దావోస్ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. తెలుగువాడి కీర్తిని చంద్రబాబు ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి నేతలు చేస్తున్న దగాకోరు విమర్శలు, అబద్ధపు ప్రచారాలు నమ్మవద్దని ఆమె హితవుచేశారు. మంగళవారం ఆమె నివాసంలో టిడిపి నేతలతో కలసి మీడియాతో మాట్లాడారు.

## వాహనాల్లో పరిధికి మించి ఎక్కించ వద్దు.... అర్బన్ సీఐ..

రేణిగుంట జనవరి 28 ప్రభాతవార్త



పాఠశాల వాహనాల్లో పరిధికి మించి విద్యార్థులను ఎక్కించకూడదని రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్ర హెచ్చరించారు. జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ పోలీస్ స్టేషన్ లో అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన స్కూల్ యాజమాన్యాలు, బస్సుల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లతో కీలక సమావేశం నిర్వహించారు. బస్సులకు డ్రైవర్లుగా లైసెన్సులు కలిగి అనుభవం ఉన్న వారిని నియమించాలని అర్బన్ సీఐ శరత్ చంద్ర సూచించారు. క్లీనర్లుగా ఆకతాయిలను నియమించకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడపకూడదని హెచ్చరించారు. కాలం చెల్లిన ఫిట్నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను ఎక్కించకూడదన్నారు. బస్సుల్లో పాఠశాలకు చెందిన బాధ్యతగల వారిని నియమించి పిల్లలను జాగ్రత్తగా ఎక్కించుకొని పాఠశాలలకు తిరిగి వారి ఇళ్లకు చేర్చాలన్నారు. బస్సులు పాఠశాల ఎదురుగా నడిరోడ్డుపై నిలబెట్టి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షింపమన్నారు. పాఠశాల బస్సులకు ప్రమాదాలు జరిగితే డ్రైవర్ క్లీనర్లే కాక పాఠశాల, బస్సుల యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం పోలీసులు అర్బన్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి మద్యం సేవించే ప్రదేశాలను గుర్తించి, పంచాయతీ కార్మికులతో అక్కడ మరుగును శుభ్రం చేయించి మద్యం సేవించకూడదు అనే బ్యానర్ లను తగిలించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి జన జీవనానికి విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు : చంద్రశేఖర్

సత్యవేడు, జనవరి 28 ప్రభాతవార్త:



నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను జారవిడుచుకోవద్దని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, సిడాప్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం సత్యవేడు ప్రాంతంలో పారిశ్రామీకరణ వేగంగా జరుగుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే వివిధ కంపెనీలు నడుస్తుండడంతో ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉందన్నారు. అందు వల్ల నిరుద్యోగులైన యువతి, యువకులు ఈ అవకాశాలను అందుపుచ్చుకోవాలన్నారు. వారి వారి అర్హతకు సంబంధించి ఉద్యోగాల్లో చేరి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను అధికమించడానికి ప్రభుత్వం ప్రతి నెల ఉద్యోగ మేళాలను కంపెనీ ప్రతినిధులతో నిర్వహిస్తున్నట్టు గుర్తు చేశారు. తదనంతరం వీల్స్ ఇండియా ప్రతినిధి ఆకాష్, బ్లూస్టార్ హెచ్‌ఆర్‌లు మోనిషా, రాజశేఖర్, ముత్తూట్ గ్రూపు ప్రతినిధులు రాజశేఖర్, జానకిరామ్, ఏరియాస్ ఆగ్రో కంపెనీ ప్రతినిధులు మధు నాగురయ్య తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఉద్యోగ మేలాకు 44 మంది హాజరైనట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల స్కేల్ ఆబ్‌కో-ఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు వీరి అర్హత సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూ జరిపి పలువురిని ఎంపిక చేశారు. శ్రీసిటీ ఎస్‌డీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఉద్యోగమేళా కొనసాగింది. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలవైస్ ప్రిన్సిపాల్ శ్యాముల్ అరవింద్, ప్లేస్‌మెంట్ అధికారి హన్న, పలువురు నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు.

## కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

పుత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త :



విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల పట్ల అవగాహన కలిగి వుండాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. మంగళవారం కాలేజీలో కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన తిరుపతికి చెందిన వే ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ పైడి అంకయ్య, జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రత్నకిషోర్ మాట్లాడుతూ వివిధ రకాల ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా కాలేజీలో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఒక లక్ష రూపాయలు విలువైన కోచింగ్ ఉచితంగా అందిస్తామని ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. అలాగే విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై సమాచారంతో కూడిన ఉచిత పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ కన్వీనర్ ఎ.నాగేశ్వరరావు, కార్యక్రమ సమన్వయకర్త టి.నరసింహులు, వైస్ ప్రిన్సిపల్స్ కోటేశ్వరయ్య, వీరయ్య పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం

ఎంఈఓ-2 భాస్కర్‌బాబు

చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త:



18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన (మైనర్లు) వాహనాలను నడపటం చట్టరీత్యా నేరమని ఎంఈఓ -2 భాస్కర్‌బాబు అన్నారు. పనపాకం జడ్పీ హైస్కూల్లో మంగళవారం జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలను నడపటం ద్వారా ప్రమాదాలబారినపడి తల్లిదండ్రులకు దుఃఖం కలిగించవద్దన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వాహనాలను నడిపితే తండ్రిపై సైతం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వాచ్‌ఎం పి.పురుషోత్తం రెడ్డి, రహదారుల భద్రత మేనేజర్ శ్యాంప్రశాంత్, ఇన్సిడెంట్ మేనేజర్ వినోద్, ఎన్‌హెచ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 30న పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం

పుత్తూరురూరల్, జనవరి 28 ప్రభాతవార్త:

ఈ నెల 30న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబరు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## పోలీసులు,రెవెన్యూ అధికారుల సమక్షంలోనే...

వైసీపీ గుండాలు నా భూమిని కబ్జా చేశారు...!

- కుటుంబ సభ్యులతో కలిసి బాధితుడు సుబ్రమణ్యంరెడ్డి ఆవేదన



తిరుపతి హెల్త్, జనవరి 28 ప్రభాతవార్త ః రెవెన్యూ, పోలీసుల సమక్షంలోనే వైసీపీ గూండాలు కొంత మంది నాభూమిని కబ్జా చేశారని బాధితుడు పి. సుబ్రమణ్యంరెడ్డి తెలియజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో బాధితుడు తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. తనకు తాత నుంచి వంశపారంపర్యంగా తన తల్లి, పిన్నమ్మల ద్వారా సంక్రమించిన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం సి. రామాపురం గ్రామ లెక్క దాఖల సర్వే నెం.163/1లో 88 సెంట్లు,163/3లో 40 సెంట్లు మొత్తం ఒక ఎకరా 28 సెంట్లు ఉందన్నారు. అయితే కొంత మంది వైసీపీ నాయకుల ప్రోద్భలంతో మా గ్రామానికి చెందిన వైసీపీ గుండాలు కొల్లంగుంట రామ్మూర్తిరెడ్డి, అతని కుమారుడు నరేంద్రబాబురెడ్డిలు కొంత మంది రౌడీ మూకలతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పోలీసుల సమక్షంలోనే సర్వే నెం. 163/1లో 14 సెంట్లు భూమిని కబ్జా చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులకు తన బాధను చెప్పుకున్నా వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ భూమికి సంబంధించి కోర్టులో జరుగుతుందన్నారు. నా భూమిని నాకు ఇప్పించాలని, నా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితుడు సుబ్రమణ్యంరెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సర్వ సభ్య సమావేశానికి అటవీ శాఖ అధికారులు డుమ్మా

పాకాల, జనవరి 28, ప్రభాతవార్త



పాకాల మండలంలో మంగళవారం రోజున నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అటవీ శాఖ అధికారులు డుమ్మా కొట్టడం పై ఎమ్మెల్యే పులివర్తి నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనుగులు అడవి పందులు రైతులు పొలాలలో సంచరించి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తూ ఉండడంతో ఫారెస్ట్ రేంజర్ గార్డ్ మండల సమావేశానికి హాజరు కాకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పాకాల మండలంలోని రైతుల పంటలకు జరిగిన నష్టం వారికి కలిగిన అసౌకర్యానికి అటవీ శాఖ అధికారులు, ఎంత మందికి నష్ట పరిహారం ఇచ్చారో చెప్పాలన్నారు. ఏ ఒక్కరికి ఆర్థిక సహాయం ఇవ్వకపోగా కనీసం మీటింగ్ కూడా హాజరు కాకపోవడం పై తిరుపతి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. రైతులు తమ పొలాల్లో టేకు కలవ, వేప కలపను గృహ వినియోగాల కోసం ట్రాక్టర్ పై ఎక్కించుకొని తీసుకువెళ్లేటప్పుడు వారిపై దాడి చేసి లక్షల రూపాయిలలో ఫైనుల్ల వసూలు చేసే అటవీ శాఖ అధికారులు పంట నష్టం కలిగించే ఏనుగులు అడవి పందులు విషయంలో నిద్రమత్తు వీడి రైతులకు సహకరించాలి అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అలాగే పాకాల మండల తహశీల్దార్‌కి రైతులు తమ పొలంలో టేకు, వేప కలప గృహోపకరణాల కోసం చెట్లను కోయడం కొరకు దరఖాస్తు చేసుకుంటే ఒకటి రెండు రోజుల్లో పర్మిషన్ మంజూరు చేసి రైతులకు అండగా నిలవాలని తెలిపారు.

## పునర్ నిర్మాణం వైపు వేగంగా అడుగులు

పాకాల, జనవరి 28, ప్రభాతవార్త



పాకాల మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తున్న విషయం ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. ఆహర్నిసలు ఎమ్మెల్యే నాని పడే కష్టం వాటి యొక్క ఫలితాలు త్వరలోనే పాకాల ప్రజలకు అందే అకాశాలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. ఒకవైపు కోట్ల రూపాయలలో పనులు మొదలు పెట్టడం మరోవైపు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మండలంపై ప్రత్యేక దృష్టి సారించడం ఇవన్నీ కలిసి ప్రజలలో నూతన ఉత్తేజాన్ని నింపుతున్నాయి అనడంలో సందేహం లేదు. ఎం పి దగ్గుమల ప్రసాద్ రావు చొరవతో పాకాలకే మనిహారం కానున్న రైల్వే కోచ్ డిపో యాడ్ వల్ల కూటమి ప్రభుత్వానికి మరింత పేరు తద్వారా మరింత మేలు చేకూరే అవకాశం ఉందని పాకాల మండలంలోని ప్రజలు తమ సంతోషాన్ని తమ అభిప్రాయాన్ని సన్నిహితులతో వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి శాసన సభ్యులు చంద్రబాబు ఆదేశాల మేరకు నిత్యం ఇలాగే మరింత అభివృద్ధి కొనసాగించి మెరుగైన ఫలాలు ప్రజలకు అందే విధంగా మరింత నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి అని మెజారిటీ ప్రజల నుంచి వస్తూ ఉన్న ప్రస్తుత అభిప్రాయం. ఇక మండలంలో పారిశుధ్యం, నీటి కుళాయి పట్టణ నీటి పంపిణీ వ్యవస్థ మండలంలోని హ్యాండ్ బోరు పంపులను సకాలంలో స్పందించి రిపేరు చేసే విషయంలో ఎప్పటి కప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది సాకులు చూపకుండా అధికారులు తమ పనికి మరింత మెరుగులు దిద్దుకోవాల్సి అవసరం వుంది అని గమనించాలి. పాకాల మండలంలోని పుర ప్రజలకు బాట సారులకు అందు బాటులో త్రాగటానికి మంచి త్రాగు నీరు అందించే దిశగా ప్రయత్నం చేయాలని మండల ప్రజల నుంచి అభిప్రాయాలు ఈ సందర్భంగా వ్యక్తమవుతున్నాయి.

## త్వరలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన

తిరుపతి విద్య జనవరి 28 ప్రభాత వార్త:

త్వరలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన దేశ వ్యాప్తంగా నిర్వహించినట్లు ఎఫ్డిసిఐ ఛైర్మన్ సునీల్ సేది తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ రెండు శక్తివంతమైన కేంద్రాలను ఒక చోటకు తీసుకువచ్చి బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో అనుసంధానం చెందినందుకు ఎఫ్ డిసిఐ ఉల్లాసంగా ఉందన్నారు. అంతర్జాతీయ ఫ్యాషన్, మ్యూజిక్ కలిపి స్వచ్ఛమైన ఆశ్చర్యాన్ని ప్రేరేపించే వినోదాన్ని అందించే గొప్ప ప్రదర్శనలు చేపడతామన్నారు. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ( ఎఫ్డిసిఐ)తో మరోసారి చేతులు కలిపి ఈ ఫ్యాషన్ టూర్ నిర్వహిస్తున్నమన్నారు. దేశంలో ఫ్యాషన్, బాలీవుడ్, మీడియా, వ్యాపార రంగాలకు చెందిన 70 మందికి పైగా ప్రముఖ వ్యక్తులతో కలిసి తన కళాత్మక ప్రతిభను గుర్తు చేసుకునే అద్భుతమైన సంబరంతో ఇది గురుగ్రామ్ లో ప్రారంభమవుతుంది అని అన్నారు. పెర్నాడ్ రికార్డ్ ఇండియ ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్తీక్ మొహీంద్రా మాట్లాడుతూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఎఫ్ డిసిఐతో కలిసి, ప్రతి డిజైనర్, సెలబ్రిటీ లతో కలిసి టూర్ నిర్వహిస్తున్నామన్నారు . ఈ సమావేశంలో ఆషిష్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ఏపీ ఖ్యాతిని పెంపొందించాలి

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

తిరుపతి క్రీడ, జనవరి 28, ప్రభాతవార్త



క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్టతలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపచేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మంగళవారం పలువురు క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌ను కలిశారు. యోగాలో గిన్నిస్ రికార్డు సాధించిన తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన సిహెచ్ వసంత లక్ష్మి స్పోర్ట్స్ కాంప్లెక్సు లోని డిఎస్ఏ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2023 డిసెంబర్ 3న యోగాలో భాగంగా 342 గంటల పాటు ఆమె సమకోనాసనం వేసి పాత రికార్డులను బ్రేక్ చేసినట్లు వివరించారు. దీనికిగానూ 2024 డిసెంబర్ 29న ఆమెకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులలో నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాప్ ఛైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం ఇటీవల ఢిల్లీలో జరిగిన ఖోఖో తొలి ప్రపంచ కప్‌లో ఇండియా నుంచి రిఫరీగా వ్యవహరించిన ఎస్. సురేష్ కుమార్ శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖోఖో నేషనల్స్‌లో ఏపి నుంచి మూడుసార్లు ప్రాతినిథ్యం వహించానని, అలాగే సీనియర్ సౌత్ జోన్ నేషనల్స్‌లో ఎస్వీ యూనివర్శిటీ భాగస్వామ్యంతో మూడుసార్లు పాల్గొని సిల్వర్ మెడల్ కూడా సాధించినట్లు వివరించారు. ప్రస్తుతం యదమర్రి మండలం కొటాలం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ ఆయనను అభినందిస్తూ భవిష్యత్తులో ఖోఖో క్రీడాకారులకు మరిన్ని మేళకువలు నేర్పించి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలని సూచించారు. క్రీడల్లో ఏపీ సత్తాచాటాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిఎస్డిఒ సయ్యద్ సాహెబ్, చిత్తూరు డిఎస్డిఒ బాలాజీ, కోచ్‌లు పాల్గొన్నారు.

## నేడు బిజెపి జిల్లా అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం

తిరుపతి(రవాణ), జనవరి 28ప్రభాతవార్త:



బిజెపి తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడుగా నియామకమైన సామంచి శ్రీనివాస్ బుధవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయనున్నారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో సాయంత్రంజరిగే ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తోబాటు జిల్లాకు చెందిన కూటమి ఎంఎల్ఎలు, బిజెపి నేతలు పాల్గొంటున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడుగా నియమితులవడం పార్టీకి మంచిరోజులేనని శ్రేణులు భావిస్తున్నాయి.

## ఉత్తమ సేవా పురస్కారం

**కేవీబీ పురం, జనవరి 28 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం అందించే ఉత్తమ సేవా పురస్కారంలో భాగంగా కేవీబీ పురం తహసీల్దార్ మునిరత్నంకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అధికారిగా మండల ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన ప్రభుత్వానికి అందించిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను పదవి విరమణ చేసే వరకు రెట్టింపు ఉత్సాహంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. టైపిస్టు, ఆర్ఐగా, డీటీగా ఇప్పటికే11సార్లుఉత్తమ సేవా పురస్కారాలను అందుకు న్నారు.

**CHANGE OF NAME**

● I,PARLAPALLI SUSEELA (Old Name) W/o PARLAPALLI MUNI RATHNAM REDDY.R/o.D.No:18-41,Mulastanamma Temple Street, Chandragiri, Tirupati Dt. A.P- 517101. I changed my name to PARLAPALLI SUSEELAMMA W/o. PARLAPALLI MUNI RATHNAM REDDY. Henceforth I will be known as PARLAPALLI SUSEELAMMA. (New Name).

## ఫోన్ చేస్తే సమస్యను పరిష్కరిస్తా : కమిషనర్



వెంకటగిరి, జనవరి 28 ప్రభాతవార్త : పట్టణంలో సమస్యలు ఏమన్నా ఉంటే నాకు ఫోన్ చేస్తే పరిష్కరిస్తానని ఇన్చార్జి కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉన్న వెంకటేశ్వర్లు ఇక్కడ మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని చెప్పారు. పారిశుద్యం మేరకు చర్యలు చేపడతానని తెలిపారు. డి.శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు సిబ్బంది కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు

# గూడూరు డివిజన్

## పోలీస్ డైరీని ఆవిష్కరించిన బోస్



వెంకటగిరి, జనవరి 25 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరీ 2025ను 9వ బెటాలియన్ నందు ఇన్చార్జి కమాండెంట్ ఎం. అరుణ్ బోస్ ఆవిష్కరించారు. అధికారుల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 23 మంది అభ్యర్థులు ఎంపిక



గూడూరు, జనవరి 28 ప్రభాతవార్త : గూడూరులోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా మంగళ వారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ సిడాప్, డిఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిఐ ప్రిన్సిపాల్ వి.నాగరాజు ఈ జాబ్ మేళాలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు మంచి అవకాశం, వారి అర్హతకు తగ్గట్లు ఇంటర్వ్యూలో పాల్గొని అవకాశం అందిపుచ్చుకొని రాణించాలని అలాగే ప్రతి ఒక్కరు ఉద్యోగంలో చేరి ఆర్థికంగా రాణించాలన్నారు. ఐటిఐ ఓఎస్ శ్రావణ్, ఐటిఐ టిఓ వెంకటేశ్వర్లు,స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చెన్నయ్య, దేసయ్య, సిల్ హబ్ కోఆర్డినేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కాళంగిని కొల్లగొడుతున్నారు

**- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు**



సూళ్లూరుపేట, జనవరి 28 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. చెంగాళమ్మ గుడి సమీపంలోని కాళంగి నదిలో జేసీబీలు పెట్టి ట్రాక్టర్లు ద్వారా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా కాలేజి గ్రౌండ్‌లో వర్షపు నీటిని నియంత్రిం చేందుకు కాళంగి నది నుంచి ఇసుక తీసుకొచ్చి మైదానంలో నింపారు. ఈ ప్రక్రియను ఇంతటితో ఆపకుండా ప్రస్తుతం ఇదే తతంగాన్ని కొనసాగిస్తున్నారు. అసలు ఇసుకను నిషిద్ధ ప్రాంతమైన కాళంగి నదిలో తవ్వేందుకు ఎవరు అనుమతించారో అర్థం కావడం లేదు. ఇదిలావుంటే శిథిలావస్థలో ఉన్న కాళంగి నదిపై ఉన్న వంతెనకు సమీపంలోనే ఈ ఇసుక తవ్వకాలు జరగడం విశేషం. బహిరంగంగా ఇసుకను తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. అసలు ఎవరు ఇసుకను తవ్వుకోమన్నారో, ఎక్కడికి తీసుకెళుతున్నారనేది ప్రశ్నార్థకం. అధికారులు స్పందించాల్సి ఉంది.

## వైద్యరంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, జనవరి 28 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రి సలహాసంఘ కమిటీ నూతన ఛైర్మన్‌గా ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని చెప్పారు. ఇందులో భాగంగానే నూతనంగా ఏర్పాటైన కమిటీలు ఆసుపత్రి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశంపై కమిటీ ద్వారా నిర్ణయం తీసుకొని వాటిని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని విజయశ్రీ తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులు ఇందుకు తగ్గట్టుగా పనిచేసి ప్రభుత్వాసుపత్రికి పేదలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, పి.మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

## పెళ్ళకూరులో గ్రావెల్ మాపియా!



నాయుడుపేట 28 ప్రభాతవార్త :పెళ్ళకూరు మండలంలోని కానూరు ప్రభుత్వ భూముల నుండి కొంత మంది అక్రమార్కులు గ్రావెల్ మాపియాకు పాల్పడు తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవంలేదని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేటలో లేఔట్లుకు గ్రావెల్ మంచి గిరాకి ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుండి అనుమతులు తీసుకొని గ్రావెల్ తరలించాల్సి ఉండగా, పెళ్ళకూరులో మాత్రం అలాంటి నిబంధనలు పాట్టించకుండా, కొంతమంది అక్రమార్కులు ఇష్టాను రాజ్యంగా గ్రావెల్ అక్రమి తరలింపుకు పాల్పడుతున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త గూడూరు మైనింగ్ ఎడిని వివరణ కోరగా ఆయన మాట్లడుతూ పెళ్ళకూరు మండలం కానూరులో గ్రావెల్ తరలించేందుకు ఏలాంటి అనుమతులు తీసుకోలేదని తెలియజేశారు.ఎవరైన అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతపై...టీడీపీ సానుభూతిపరులు దాడి!

డక్కిలి,జనవరి 28 ప్రభాతవార్త : డక్కిలి మండలం డీఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామానికి చెందిన బొల్లినేని భాస్కర్ నాయుడుపై అదేగ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు మంగళవారం దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు...భాస్కర్ నాయుడు మంగళవారం ఇంటి నుంచి సొంతపని నిమిత్తం బాలాయపల్లి మండలం వెంగమాంబపురంకి బయలుదేరు వెళ్తుండగా మార్గ మధ్యంలో టీడీపీ సానుభూతిపరులు అయిన చేమూరు శ్రీనివాసులు, చేమూరు వెంకటరమణయ్య, చేమూరు పెంచలయ్య, నల్లిపాక చంద్రయ్య అనే వ్యక్తులు అతనిపై దాడికి దిగి పరుష పదజాలంతో దూషించారన్నారు. గొల్లపల్లి గ్రామంలోని సర్వే నెంబరు1లో గ్రామానికి చెందిన పావులూరు భాస్కర్ నాయుడు అక్రవమించి జామాయిలు మొక్కలను అక్రమంగా నరికారు. ఇదే క్రమంలో తన పొలంలో ఉన్న జామాయిల్ మొక్కలను బొల్లినేని భాస్కర్ నాయుడు నరికేసినట్లు డక్కిలి పోలీసు స్టేషన్‌లో ఇటీవల పిర్యాదు చేయగా అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వాస్తవానికి పావులూరు భాస్కర్ నాయుడు అటవీ భూములలో జామాయిల్ మొక్కలు పెంచి నరికేసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించి అతనిపై క్రమ శిక్షణ చర్యలలో భాగంగా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.దీంతో ప్రస్తుతం పావులూరు భాస్కర్ నాయుడు నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఈక్రమంలో టీడీపీ నేత అయిన పావులూరు భాస్కర్ నాయుడును సోమవారం టీడీపీ సానుభూతిపరులు పథకం ప్రకారం బొల్లినేని భాస్కర్ నాయుడుపై దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి!

చిల్లకూరు, జనవరి 28 ప్రభాతవార్త : మండల పరిధిలోని రైట్ ఆర్ సత్రం వద్ద జాతియ రహదారి పక్కన ఏర్పాటు అయిన అపెక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కైలాస్ ప్రధాన్ (48)ని కారు ఢీకొని మృతి చెందాడు. పోలీసులు వివరాలు మేరకు ఓడిశా రాష్ట్రంగా చెందిన ప్రదాన్ జీవనాధారం కోసం అపెక్స్ పరిశ్రమలో పనిచేస్తూ డ్యూటీ దిగి ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సిబ్బందితో కలిసి సంఘటన స్థలం చేరుకుని 108 వాహనం సహాయంతో చికిత్సని మొత్తం కోదూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. కారును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## లారీని ఢీకొట్టిన కోళ్ళవ్యాను .. క్లీనర్ మృతి



చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త: ఆగివున్న లారీని కోళ్ళ వ్యాను ఢీకొట్టిన ప్రమాదంలో క్లీనర్ వెంకటేష్ 52) అక్కడికక్కడే మృతి చెందిన దుర్ఘటన మామండూరు వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. తిరుపతి నుండి వెళుతున్న కోళ్ళ వ్యాను డ్రైవర్ షణ్ముగం అతివేగంతో నడుపుతూ అదుపు కోల్పోయి ఆగివున్న లారీని ఢీకొట్టడంతో వెంకటేష్ వ్యానులో చిక్కుకుపోయి మృతి చెందాడు. దీంతో డ్రైవర్ పరాయ్యాడు. సమాచారం అందుకున్న సిఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని వ్యానులో చిక్కుకున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతికి తరలిం చారు. ప్రమాదం నేపథ్యంలో స్థంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఆర్టిఓ కిషోర్



గూడూరు, జనవరి 28 ప్రభాతవవార్త : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆర్టిఓ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అధికారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టివో కిషోర్ మాట్లాడుతూ జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ప్రమాదాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారని ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. అలాగే అధిక వేగం సెల్ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. డిఎస్పి గీత మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని హెల్మెట్ ధరించి సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు సునీల్, జాకీర్, ప్రభాకర్, సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసులు, విద్యార్థులు వాహనాల డీలర్లు పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణకు పిచికారి చేయాలి



డక్కిలి,జనవరి 28 ప్రభాతవార్త : వరి పంటలో వ్యాపించే తెగుళ్ల నివారణకు సకాలంలో క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున్‌సాగర్ తెలిపారు.మండలంలోని శ్రీపురం, మాటుమడుగు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో డక్కిలి వ్యవసాయాధికారి విజయభారతి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

## ఫిబ్రవరి 1న ముగ్గురు మంత్రులతో శ్రీకాళహస్తిలో సమీక్ష

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త : దేవాదయశాఖలో పని చేయటం పూర్వ జన్మ సుకృతం.ఇక్కడ భక్తులకు అందించే సేవలు భగవంతునికి చేసే సేవలాంటిది. వచ్చేనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులు శివాలయాలకు వస్తుంటారు. జవాబుదారి తనంతో పని చేయాలని మంగళవారం దేవాదాయశాఖ కార్యాలయంలో జరిగిన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ ఇఓలతో జరిగిన సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్‌లు సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినయ్ చంద్,దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎడిసి చంద్రకుమార్, ఎస్టేట్ ఆఫీసర్ డి.భ్రమరాంబ, ఆర్‌జెసి చంద్రశేఖర్ ఆజాద్‌లతో పాటు మూడు ఆలయాల ఇఓలు హాజరయ్యారు. శ్రీకాళహస్తి నుంచి ఇఓ డి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్టేట్ ఆఫీసర్ డి.భ్రమరాంబ మాట్లాడుతూ ఐదేళ్ళ క్రితం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాల్లో మాస్టర్ ప్లాన్ అమలుకు భూసేకరణ చేసినట్లు వివరించారు. అయితే తరువాత ఐదేళ్ళలో ఈ అంశం కదల్లేదన్నారు.ఒకే ఒక భవనం తొలగించలేకపోయారని చర్చించారు.అలాగే ఆలయాభివృద్ధికి సంబంధించి సుధీర్ఘంగా చర్చించారు. ఫిబ్రవరి 1న సమీక్ష జరుపుటకు రాష్ట్ర మంత్రులు హోంశాఖ మంత్రి అనిత,దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,రెవెన్యూ శాఖ మంత్రి ఆనగాని ప్రసాద్‌లు హాజరౌతున్నట్లు ప్రకటించారు. కాగా సమీక్షా సమావేశం స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు సమాచారం.

## మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి



గూడూరు, జనవరి 28 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు గౌడు, ఉపకులాల వారికి మద్యం షాపుల కేటాయించేందుకు చర్యలు తీసుకుం దని ఆసక్తి గల గౌడు, ఉపకులాల వారు ఫిబ్రవరి 5వ తేదిలోగా అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు లేదా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని గూడూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహ శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో మొత్తం 12 మద్యం దుకాణాలు కల్లుగీత కార్మికులు గౌడు, ఉపకులాల వారికి కేటాయించడం జరిగిందన్నారు. వివరాల కోసం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారులు కరీమా బేగం, అరుణకుమారి, సురేంద్ర పాల్గొన్నారు.

## ప్రయాణాల్లో భద్రతా నియమాలు పాటించాలి



డక్కిలి,జనవరి 28 ప్రభాతవార్త: ప్రయాణాలు చేసే సమయంలో భద్రతా నియమాలు పాటించాలని డక్కిలి ఎస్ఐ శివశంకర్ తెలిపారు. స్థానిక డీకేఎం కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలని వివరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

## జిఎస్ఎల్‌వి 15 విజయవంతానికి పూజలు



శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త : శ్రీహరి కోట నుంచి ప్రయోగించనున్న వందవ రాకెట్ జిఎస్ఎల్‌వి 15 విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మెన్ నారాయణన్ మంగళవారం వాయులింగేశ్వరుని సన్నిధిలో పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 6.29 గంటలకు షార్‌నుంచి100వ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఇది విజయవంతం అయ్యి ప్రపంచ దేశాల్లో ప్రసంశలందుకోవాలని కోరుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సుబ్రమణ్యం,ఎపిఆర్ఓ రవిలు నిర్వహించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి:ఎస్ఐ

బాలాయపల్లి, జనవరి 28 ప్రభాతవార్త : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కామినేని గోపి తెలిపారు. మండలంలో నిజయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.వి రమణయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకటగిరిని కమ్మిన పొగ మంచు



వెంకటగిరి, జనవరి 28 ప్రభాతవార్త : పట్టణాన్ని పొగ మంచు కమ్మి వేసింది. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు తగ్గలేదు. పొగ మంచు ఉండటం వల్ల వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయత్నం చేయాల్సి వచ్చింది. ఒక మంచుతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగ మంచువల్ల వాకర్స్ కూడా అవస్థలు పడ్డారు.పొగమంచు వల్లప్రజలుఅవస్థలు ఎదుర్కొన్నారు.

## వాలంటీర్లుకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం



వాకాడు, జనవరి 28 ప్రభాతవార్త: వాకాడు మండల మహిళా సమాఖ్యలో మండలంలో గుర్తించిన 37 మంది వాలంటీర్లకు మంగళవారం ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అన్నపూర్ణ రావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపిడిఓ చేతుల మీదుగా ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం మెటీరియల్ ఆవిష్కరించి, వాలంటీర్లకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఏపిఎం మాధవి, వాలంటీర్లు వివోఏలు మండల వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మణ్ణికి ఇస్రో ఛైర్మన్ నారాయణన్ పూజలు



తడ, జనవరి 28 ప్రభాతవార్త :సూళ్ళూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయాన్ని నూతన ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మంగళవారం దర్శించి పూజలు చేశారు. ఇస్రో ఛైర్మన్ నారాయణన్ దంపతులు శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి పూజలు చేశారు. రేపు జరిగే జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మణ్ణి ఎదుట కోరుకున్నారు. అనంతరం ఇస్రో ఛైర్మన్ దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలు అందజేశారు. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి దాకా ఇస్రో ఎన్నో చారిత్రాత్మక విజయాలను సాధించి ఇప్పుడు 100 వ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైందని అన్నారు. ఆయనతో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం, రాజరాజన్ గోపికృష్ణ ఉన్నారు.

## పాఠశాలలో క్రీడా దినోత్సవం



గూడూరు, జనవరి 28 ప్రభాతవార్త : గూడూరులోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌కు విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, పిఈటి చైతన్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారులను డాక్టర్స్ టీం

వాకాడు, జనవరి 28 ప్రభాతవార్త: వాకాడు మండలంలో 15వేలు పెన్షన్ పొందుతున్న హెల్త్ పెన్షన్ లబ్ధిదారులను స్పెషలిస్ట్ డాక్టర్స్ టీమ్ మంగళవారం పరిశీలించారు. వారు మండలంలో ఉన్న 12మంది పెన్షన్ లబ్ధిదారులను వారి ఇంటి వద్ద కుణ్ణంగా పరిశీలించారు. డాక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ ఎస్‌కె సలాుద్దీన్, డాక్టర్ దీప్తి, ఎంపిడిఓ పిఎం అన్నపూర్ణ రావు, ఈఓపిఆర్డి మహేశ్వర రావు పాల్గొన్నారు.

## 27వ మహాసభలను జయప్రదం చేయండి



గూడూరు, జనవరి 28 ప్రభాతవార్త : నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సిపిఎం పార్టీ ఆంధ్రప్రదేశ్ 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గూడూరులోని మార్కెట్ సెంటర్‌లో సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు మంగళవారం ఆటో స్టాండ్ దగ్గర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాలను ప్రైవేటు పరం చేయాలని ఉద్దేశంతో ట్రాన్స్‌ఫోర్ట్ రంగానికి ఆదాయం సమకూరుస్తూ ఉన్న ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలు ఫిట్నెస్ సర్టిఫికేట్లు జారీ చేసే వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలు, వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెంటర్ ఆటో స్టాండ్ కార్యదర్శి బి. రమేష్, ఉపాధ్యక్షులు బి.పెంచలయ్య, టి.కిరణ్, సిహెచ్ శ్రీకాంత్, ఆర్.సురేంద్ర, ప్రశాంత్, నాగరాజు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విద్యార్థినిలు ఎంపిక



కల్లూరు, జనవరి 28 ప్రభాతవార్త: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థినిలు, జయశ్రీ, హిమ శ్రీ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మంజు వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరులో జరిగిన జిల్లా సబ్ జూనియర్స్, బాలికల హాకీ పోటీల లో జిల్లా జట్టు ఎంపికలో జయశ్రీ, హిమశ్రీ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక య్యారు. ఈ నెల 27 నుంచి జరుగు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం మంజువాణి, పిఈటి శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ ధన శేఖర్ ఉపాధ్యాయులు అభినందించారు.

## ఫిబ్రవరి 4న రథసప్తమి

తిరుచానూరు, జనవరి 28 ప్రభాతవార్త : తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఫిబ్రవరి 4న మంగళవారం రథసప్తమి సందర్భంగా ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంతో వాహనసేవలు ప్రారంభమ వుతాయి. అప్పటి నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అమ్మవారు హంస, అశ్వ, గరుడ, చిన్నశేష వాహనాలపై ఊరేగనున్నారు. సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు గజ వాహనాలను అధిష్టించి అమ్మవారు దర్శనమిస్తారు. రథసప్తమి కారణంగా ఫిబ్రవరి 4న ఆలయంలో శ్రీ అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఆర్జీత కల్యాణోత్సవం, కుంకుమార్చన, ఊంజల్ సేవ, వేదాశీర్వాచనం సేవలతో పాటు బ్రేక్ దర్శనాన్ని రద్దు చేశారు.

**- శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో...**

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు స్వామి వారు అశ్వ వాహనాన్ని అదిష్టించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

## మానవ అక్రమ రవాణకు అడ్డుకట్ట

**- సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి**

చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త: మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి అన్నారు. డిఆర్‌డిఎ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం మానవ అక్రమ రవాణా నుండి మహిళలు, పిల్లలకు రక్షణ అనే అంశంపై స్త్రీ శిశు సంక్షేమశాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి మాట్లాడుతూ సమాజంలో మానవ అక్రమ రవాణా మితిమీరుతున్నదని, ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వుండాలన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టుడైరెక్టర్ వెంకటేశ్వరీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విషయాలు తెలిపి క్రమశిక్షణతో పెంచాలని, పిల్లల అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళా సాధికారత జరుగుతున్నదని, ప్రతి ఒక్క మహిళ వారి పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించి మహిళ అక్రమ రవాణాను అరికట్టడానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు. దిశ స్టేషన్ డిఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని, ఇందులో మంచి తక్కువగా వుంటే చెడు ఎక్కువగా వుంటోందన్నారు. ఈ సమావేశంలో దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య, ఐసిడిఎస్ నోడల్ అధికారి జయంతి, డిసిపిఓ సుబ్రమణ్యం, సమాఖ్య నాయకురాలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా పర్యాటక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ద కేంద్రీకరించాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా అవకాశాలు వున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళాలన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు అన్యాక్రాంతమైన భూములను సంరక్షించుకునే భాగంగా టూరిజం శాఖ రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, పర్యాటక శాఖ రీజినల్ మేనేజర్ రమణప్రసాద్, జిల్లా టూరిజం అధికారి మల్లికార్జున, డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలును డిఎస్‌పి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతి డ్రైవరు, కండకర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ప్రతి బస్సులోను ఎంతో మంది ప్రయాణీకులు ప్రయాణిస్తుంటారని వారిని దృష్టిలో ఉంచుకుని బస్సులను నడపాలన్నారు.అదేవిధంగా ప్రతి డ్రైవరు, కండక్టరు తమ కుటుంబాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐలు వెంకటేశులు, గోపి, రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం..**



బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం అంటూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఎదురుగా డిఎస్‌పి ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు విధిస్తున్నామన్నారు.ఏరియా ఆస్పత్రి ఎదురుగా విద్యుత్ సబ్‌స్టేషన్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తదితర ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని పిర్యాదులు వస్తున్నాయని అందుకే ఈ ప్రాంతాలను శుభ్రం చేయించి బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో డిఎస్‌పితోపాటు సిఐలు వెంకటేశులు, గోపి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌ఘాతంతో నాలుగు బర్రెలు మృతి



తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త: మండలంలోని చిన్నకనపర్తి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌ఘాతంలో నాలుగు బర్రెలు మృతిచెందాయి. మండలంలోని పెద్దకనపర్తి దళితవాడకు చెందిన పల్లమాలరమణయ్య బర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో సోమవారం తనకున్న ఎనిమిది బర్రెలను తీసుకుని స్వర్ణముఖి నది అవతలి ఒడ్డుకు పశువుల మేతకోసం తీసుకెళ్ళాడు. మధ్యాహ్న సమయంలో భోజన నిమిత్తం ఇంటికి వెళ్ళి తిరిగిరాగా నాలుగు బర్రెలు అదృశ్యమయ్యాయి. వాటికోసం రాత్రి వరకు వెతికి చూసినా జాడలేకపోవడంతో చేసేది లేక ఇంటికి తిరుగుముఖం పట్టాడు. మంగళవారం తన బర్రెల జాడకోసం నది వద్దకు వెళ్ళగా చిన్నకనపర్తి గ్రామానికి చెందిన చెరుకూరి వాసునాయుడు వరి పొలంలో విగత జీవులుగా దర్శనమిచ్చాయి. వాసునాయుడు అడవి జంతువుల కోసం తన పొలం చుట్టు విద్యుత్ తీగలు కట్టి విద్యుత్ సరఫరా చేయడంతోనే తన బర్రెలు మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.